

రైల్వేస్టేషన్లలో మెరుగైన వసతులు

ప్రయాణికుల అవసరాల మేరకు రైల్వేస్టేషన్ల లో మెరుగైన వసతులు కల్పిస్తామని డీఆర్ఎం గోపాలకృష్ణన్ అన్నారు.

- 8లో▸



సాంకేతిక పురోభివృద్ధి

నూతన సాంకేతికను అందిపుచ్చుకుంటూ వినియోగదారులకు మెరుగైన సేవలు అందించడమే లక్ష్యంగా టీజీ ఎన్పీడీసీఎల్ ముందుకెళ్తోంది.

- 8లో▸

గరిష్టం/కనిష్టం
33°/25°

వాతావరణం

జిల్లాలో ఉదయం నుంచి ఆకాశం మేఘావృతమై ఉంటుంది. మధ్యాహ్నం వేళ సాధారణంగా ఉంటుంది. సాయంత్రం సమయంలో ఆహ్లాదంగా ఉంటుంది.

చకచకా పనులు

- శ్రావణ మాసంలో ఊపందుకున్న ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు
- త్వరగా పూర్తిచేయాలని అవగాహన కల్పిస్తున్న అధికారులు
- వీక్లీ పేమెంట్ సిస్టంతో లబ్ధిదారుల్లో పెరిగిన విశ్వాసం
- ఆషాఢంలో మంచి రోజుల కోసం ఎదురుచూపులు

సాక్షి, వరంగల్: జిల్లాల్లో ఇందిరమ్మ ఇళ్ల పథకం ఇప్పుడిప్పుడే పట్టాలెక్కుతోంది. సకాలంలో ప్రభుత్వం డబ్బులు ఇస్తుందో లేదోననే సందిగ్ధంలో ఉన్న లబ్ధిదారులు.. శ్రావణ మాసం ప్రారంభం కావడంతో చాలామంది ముగ్గులు పోసి ఇంటి నిర్మాణాలు కూడా చేపడుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం 'వీక్లీ పేమెంట్ సిస్టం' తీసుకొచ్చింది. దీంతో జిల్లాలో ప్రస్తుతం నిర్మాణంలో ఉన్న 3,068 ఇళ్లలో 1,336 ఇళ్ల నిర్మాణాన్ని శ్రావణం మొదలయ్యాకే ప్రారంభించారని గృహనిర్మాణ విభాగాధికారులు చెబుతున్నారు. ఎందుకంటే 1,722 మంది లబ్ధిదారులకు బేస్‌మెంట్, రూఫ్ లెవల్, స్లాబ్ లెవల్ వరకు రూ.లక్ష నుంచి రూ.నాలుగు లక్షలు ఇస్తోంది. వీటిలో చాలా ఇళ్లు రూఫ్‌లెవల్ వరకు పూర్తయ్యాయి. ఇప్పటికే ముగ్గు పోసి నిర్మాణానికి సిద్ధంగా ఉన్న 2,306 మంది లబ్ధిదారులు కూడా త్వరలోనే పనులు ప్రారంభించేలా అక్కడి పంచాయతీ కార్యదర్శులు, ఎంపీడీఓలు కూడా అవగాహన కలిగిస్తున్నారు. వీరిలో చాలామందికి స్వయం సహాయక సంఘాలతో రుణాలు రూ.50 వేల నుంచి రూ.లక్ష వరకు ఇప్పించి, బేస్‌మెంట్ నిర్మాణం పూర్తయ్యాక వచ్చిన డబ్బులను ఎస్‌హెచ్‌జీల ఖాతాల్లో జమ అయ్యేలా కూడా అధికారులు చొరవచూపుతున్నారు. ఈ మేరకు లబ్ధిదారుల నుంచి డీఆర్డీఏ దరఖాస్తులు తీసుకుంది. ఈ రుణం మంజూరుకాగానే వందలాది ఇళ్ల నిర్మాణాలు ప్రారంభమయ్యే అవకాశముందని గృహనిర్మాణ విభాగాధికారులు పేర్కొంటున్నారు. కలెక్టర్ డాక్టర్ సత్యశారద వివిధ గ్రామాల్లో పర్యటిస్తూ ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంలో ఎదురవుతున్న సమస్యలు తెలుసుకోవడంతోపాటు పంచాయతీ సిబ్బంది, ఎంపీడీఓలు ఎప్పటికప్పుడు మార్గదర్శనం చేస్తుండడంతో పనులు ఊపందుకున్నాయి. గతంలో పైలట్ ప్రాజెక్టులో ఎదురైన ఇబ్బందులతో ఎక్కడ పొరపాటు జరుగకుండా పకడ్బందీగా యాప్‌లో అన్ని వివరాలు నమోదుచేస్తూ అధికారులు ముందుకు సాగుతున్నారు.



దుగ్గొండి మండలం రేకంపల్లి గ్రామంలో నిర్మాణంలో ఉన్న ఇంటిని చూపిస్తున్న లబ్ధిదారులు

జిల్లాలో ఇందిరమ్మ ఇళ్ల పథకం వివరాలు..	
మంజూరైన ఇళ్లు :	8761
ముగ్గులు పోసినవి :	5374
ముగ్గులు పోయనవి :	3,387
నిర్మాణంలో ఉన్నవి :	3,068
ప్రారంభించాల్సినవి :	2,306

డబ్బులు లేక ఆగుతున్న లబ్ధిదారులు..

జిల్లావ్యాప్తంగా 8,761 ఇళ్లు మంజూరుకాగా.. 5,374 మంది ముగ్గులు పోశారు. 3,068 మంది ఇంటి నిర్మాణాలు ప్రారంభించారు. 2,036 మంది ముగ్గులు పోసి.. డబ్బులు లేకపోవడంతో నెల రోజుల సమయం ఇవ్వాలని గృహనిర్మాణ విభాగాధికారులను అడుగుతున్నారు. మిగిలిన 3,387 ముగ్గు పోయని వారిలో కొందరు శ్రావణ మాసంలో ముగ్గు పోసుకునేందుకు ఆసక్తి చూపుతున్నారు. ఇంకొందరు స్వయం సహాయక సంఘాల నుంచి రుణం రాగానే పనులు ప్రారంభించేందుకు సిద్ధంగా ఉన్నారు.



ఈ ఫొటోలో కనిపిస్తున్న మహిళ పేరు ఎలగొండ కేత. నల్లబెల్లి మండల కేంద్రానికి చెందిన ఈమె ఇందిరమ్మ ఇల్లు కోసం ప్రజాపాలనలో దరఖాస్తు చేసుకుంది. అధికారులు పరిశీలించి ఇందిరమ్మ ఇంటిని మంజూరు చేశారు. 32 రోజుల క్రితం పనులు ప్రారంభించింది. 20 రోజుల్లో పునాదిస్థాయి వరకు పనులు పూర్తి చేసింది. అధికారులు కొలతలను యాప్‌లో నమోదు చేశారు. ఈ ప్రక్రియ పూర్తి అయిన వారం రోజులకు ప్రభుత్వం మొదటి విడతలో భాగంగా లబ్ధిదారు కేత బ్యాంకు ఖాతాలో లక్ష రూపాయలు జమ చేసింది.

లబ్ధిదారులను ప్రోత్సహిస్తున్నాం..

గతంలోలాగా ఇల్లు వద్దంటున్నవారు లేరు. ఇంటి నిర్మాణం కోసం డబ్బులు తెచ్చుకునేందుకు నెలరోజుల సమయం కావాలని అడుగుతున్నారు. కొందరు ముహూర్తాల కోసం ఎదురుచూశారు. ఇప్పుడూ శ్రావణమాసంలో ప్రారంభిస్తామని చెబుతున్నారు. ఇంటి నిర్మాణానికి ఆసక్తి చూపని వారు ఎవరైనా ఉంటే వారికి గడువు ఇచ్చి, వివరాలను ప్రభుత్వానికి నివేదిస్తాం. పూర్తిస్థాయిలో అందరూ కట్టుకునేలా ప్రోత్సహిస్తూ అందరం పనిచేస్తున్నాం.

- గణపతి, హౌసింగ్ ప్రాజెక్టు డైరెక్టర్

మంచిరోజుల కోసం చూశాం



ప్రభుత్వం మా కుటుంబానికి ఇందిరమ్మ ఇల్లును మంజూరు చేసింది. ఆషాఢ మాసం కావడంతో ముగ్గుపోసి వదిలేశాం. మంచి రోజుల కోసం ఇన్నాళ్లు వేచిచూశాం. శ్రావణమాసంలో ఇంటి నిర్మాణ పనులు ప్రారంభించాం.

- త్రికోవెల రామ్మోహన్, నల్లబెల్లి

న్యూస్‌రీల్

నంబర్ ఒకటి.. ఆధార్‌లు రెండు!

- అపార్ కార్డు నమోదులో బహిర్గతం



నల్లబెల్లి: భారతీయులకు గుర్తింపు కార్డుగా జారీ చేసిన ఆధార్‌లో తప్పులు వస్తున్నాయి. వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని గుండ్లపహాడ్ గ్రామానికి చెందిన మనుబోతుల అనిత-సుమన్ దంపతుల కుమారుడు ధనుశ్ స్థానిక ప్రాథమికోన్నత పాఠశాలలో నాలుగో తరగతి చదువుతున్నాడు. ప్రతి విద్యార్థి విద్యార్హతల వివరాలను కేంద్రం అపార్ కార్డులో నమోదు చేస్తోంది. ఇందులో భాగంగా ధనుశ్ ఆధార్ నంబర్ 399671283843ను అపార్ కార్డులో నమోదు చేసేందుకు ఉపాధ్యాయులు, విద్యాశాఖ అధికారులు ప్రయత్నించగా తిరస్కరిస్తుంది. ఎందుకు తిరస్కరిస్తుందని ఆరా తీయగా.. అదే గ్రామానికి చెందిన కత్తెరపల్లి రజిత-బాబు దంపతుల కుమారుడు శివకు కూడా ఇదే ఆధార్ నంబర్ 399671283843 జారీ చేశారు. శివ సైతం గుండ్లపహాడ్ ప్రాథమికోన్నత పాఠశాలలో నాలుగో తరగతి చదువుకుంటున్నాడు. వీరిద్దరికి ఒకే ఆధార్ నంబర్ ఉండడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఆధార్ కార్డులో తప్పును సవరించి కొత్తకార్డు జారీ చేయాలని ధనుశ్ కుటుంబ సభ్యులు కోరుతున్నారు.



ఎన్‌హెచ్ఆర్‌సీ జిల్లా అధ్యక్షుడిగా రాంబాబు



దుగ్గొండి: జాతీయ మానవ హక్కుల కమిటీ (ఎన్‌హెచ్ఆర్‌సీ) జిల్లా అధ్యక్షుడిగా మండలంలోని రేబల్లె గ్రామానికి చెందిన మేర్గు రాంబాబు నియమితులయ్యారు. ఈ మేరకు ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మొగుళ్ల భద్రయ్య శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా రాంబాబు మాట్లాడారు. మంచిని పెంచడం, మానవత్వాన్ని పంచడం వంటి కార్యక్రమాలు నిర్వహించడమే సంస్థ లక్ష్యమని అన్నారు.

ఏపీఎంల యూనియన్ జిల్లా కార్యవర్గం

న్యూశాయంపేట: ఏపీఎంల (సెర్ప్) యూనియన్ జిల్లా నూతన కార్యవర్గాన్ని శుక్రవారం నగరంలో ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ఎ.రాజీరు, ఉపాధ్యక్షుడిగా సారయ్య, కార్యదర్శిగా సుధాకర్, కోశాధికారిగా ఆర్.కిరణ్‌కుమార్, సహాయ కార్యదర్శిగా రాజ్‌కుమార్, గౌరవ సలహాదారుగా ఎం.ఈశ్వరయ్య ఎన్నికయ్యారు.

దానిమ్మ మొక్కలు ధ్వంసం

గీసుకొండ: వ్యవసాయ భూమిలో నాటిన దానిమ్మ మొక్కలను ధ్వంసం చేసిన ముగ్గురిపై పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాలు ఇలా ఉన్నాయి. కొమ్మాల గ్రామానికి చెందిన కన్నెబోయిన ప్రవీణ్ విశ్వనాథపురంలోని సొంత భూమిలో ఉపాధి హామీ పథకం కింద సుమారు రెండు వేల దానిమ్మ మొక్కలను గత నెల 30న నాటాడు. శుక్రవారం ఉదయం భూమి వద్దకు వెళ్లి చూడగా మొక్కలు కనిపించలేదు. కొమ్మాల గ్రామానికి చెందిన బట్టమేకల రాజయ్య, అతడి కుమారులు నరేశ్, సురేశ్ మొక్కలను తొలగించి ధ్వంసం చేసినట్లు ఆయన తెలిపాడు. గతంలో సదరు ముగ్గురు వ్యక్తులు తన చేనులో వేసిన రాతి ఖనీలు, ఇతర పంటలను ధ్వంసం చేసి ఇబ్బందులకు గురిచేశారని బాధితుడు పేర్కొన్నాడు. దానిమ్మ మొక్కలను ధ్వంసం చేయడంతో తనకు రూ.30 వేల వరకు నష్టం వాటిల్లిందని రైతు ప్రవీణ్ ఫిర్యాదు మేరకు ముగ్గురిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు గీసుకొండ సీఐ మహేందర్ తెలిపారు.

మాడవీధుల పనుల పరిశీలన

హన్మకొండ కల్చరల్ : రాష్ట్ర దేవాదాయధర్మాదాయశాఖ స్థపతి వల్లీనాయగం శుక్రవారం శ్రీభద్రకాళి దేవాలయాన్ని సందర్శించారు. రాజగోపురాల నిర్మాణంపై, అమ్మవారి ఆలయానికి దక్షిణం వైపు మాడవీధుల నిర్మాణానికి పలు సూచనలు చేశారు. స్థపతి సూచనలను ఈఓ ద్వారా దేవాదాయశాఖ ఆమోదానికి పంపిస్తామని కుడా అధికారులు తెలిపారు. కార్యక్రమంలో ప్రధానార్చకు భిజీ భద్రకాళి శేషు, పరిశీలకులు అద్దంకి విజయ్‌కుమార్, కుడా పీఓ అజిత్‌రెడ్డి, ఈఈ భీంరావు, డీఈఈ రఘుబాబు, కాంట్రాక్టర్ శ్రీధర్‌రావు పాల్గొన్నారు. అదేవిధంగా వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి అమ్మవారిని దర్శించుకుని పూజలు జరుపుకున్నారు. అనంతరం మాడవీధుల నిర్మాణ పనులను పరిశీలించారు.

తల్లిపాలతో రోగ నిరోధకశక్తి

- జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ సాంబశివరావు

ఎంజీఎం: తల్లిపాలతో బిడ్డలో రోగ నిరోధకశక్తి మెరుగవుతుందని జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ సాంబశివరావు అన్నారు. తల్లిపాల వారోత్సవాల సందర్భంగా వరంగల్ సీకేఎం ఆస్పత్రిలో శుక్రవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌ఓ అప్పయ్య మాట్లాడుతూ తల్లిపాలతో బిడ్డలు మానసికంగా అభివృద్ధి చెందడతోపాటు ఎదుగుదలకు దోహదపడుతాయని పేర్కొన్నారు. తల్లి బిడ్డకు పాలు ఇవ్వడం ద్వారా బరువు తగ్గుతారని, గర్భాశయం సాధారణ స్థితికి వస్తుందని, క్యాన్సర్లు రాకుండా ఉండడంతోపాటు మానసిక ప్రశాంతత లభిస్తుందని తెలిపారు. ప్రతి బిడ్డ తన తల్లిపాలు తాగే విధంగా చూడాలని ఈ సందర్భంగా ఆయన సూచించారు. ఈనెల 7వ తేదీ వరకు జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ, ఐసీడీఎస్ సిబ్బంది సమన్వయంతో తల్లిపాల వారోత్సవాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. తల్లిపాల అవగాహన సదస్సులో సీకేఎం ఆస్పత్రి సూపరింటెండెంట్, ఆర్ఎంఓ డాక్టర్ మురళి, డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ ప్రకాశ్, ప్రోగ్రాం అధికారి డాక్టర్ అర్చన, సిబ్బంది, గర్భిణులు, బాలింతలు తదితరులు పాల్గొన్నారు.



సదస్సులో మాట్లాడుతున్న డీఎంహెచ్‌ఓ డాక్టర్ సాంబశివరావు

నక్షా సర్వేపై వీడియో కాన్ఫరెన్స్

న్యూశాయంపేట: పైలట్ ప్రాజెక్టు కింద భూముల డిజిటల్ రికార్డుల కోసం చేపట్టిన నక్షా సర్వేపై న్యూఢిల్లీ నుంచి కేంద్ర భూవనరుల శాఖ కార్యదర్శి మనోజ్‌కుమార్ కలెక్టర్లు, మున్సిపల్ కమిషనర్లతో శుక్రవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. దేశవ్యాప్తంగా 157 మున్సిపాలిటీలు ఎంపిక చేయగా ఇందులో వర్ధన్నపేట మున్సిపాలిటీ ఉంది. మొదటి దశ ఏరియల్ సర్వే పూర్తి అయిన నేపథ్యంలో మున్సిపాలిటీ సెక్టార్ల ల్యాండ్ డిజిటలైజేషన్ ప్రాజెక్టు గురించి సమీక్షించారు. నక్షా ప్రాజెక్టులో చేయాల్సిన పనుల గురించి పలు సూచనలు చేశారు. క్షేత్రస్థాయిలో ఏర్పాటు చేసిన శిక్షణ బృందాలు ఇంటింటికి తిరిగి సర్వే చేయుటకు రోడ్ మ్యాప్ సిద్ధం చేయాలని ఆయన సూచించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ డాక్టర్ సత్యశారద, అదనపు కలెక్టర్ సంధ్యారాణి, మున్సిపల్ కమిషనర్ సుధీర్, ల్యాండ్ సర్వే అధికారులు పాల్గొన్నారు.

కోడి'గుడ్'.. విధానం!

- సరఫరాలో అక్రమాలను అరికట్టేందుకే 'ఆన్‌లైన్' ప్రక్రియ
- విద్యాలయాల్లో 7.33 కోట్ల కోడిగుడ్లకు.. సుమారు రూ.40.60 కోట్లు
- ఉమ్మడి వరంగల్‌లో ఐదు జిల్లాలకే టెండర్లు.. భూపాలపల్లిలోనూ త్వరలో ప్రక్రియ
- ఈ నెల 6 నుంచి 12 వరకు షెడ్యూల్ దాఖలు.. 12 నుంచి 18 వరకు టెండర్లు ఓపెన్
- అర్హులైన వారికి కాంట్రాక్టు అప్పగింత.. ఏటా ఒక్కరికే ఇవ్వడంపై ఆరోపణలు
- అందుకే పాలసీ మార్చిన ప్రభుత్వం..

సాక్షిప్రతినిధి, వరంగల్: ప్రభుత్వ విద్యాలయాల్లో కోడిగుడ్ల పంపిణీకి 2025-26 సంవత్సరానికి టెండర్ల ప్రక్రియ తుది దశకు చేరింది. అర్హులైన కాంట్రాక్టర్ల ద్వారా ఉమ్మడి వరంగల్ జిల్లాలోని గిరిజన సంక్షేమ వసతి గృహాలు, అంగన్‌వాడీ కేంద్రాలు, రెసిడెన్షియల్ పాఠశాలలు, కళాశాలలకు ఆగ్‌మార్క్ నియమాల ప్రకారం కోడిగుడ్ల సరఫరా చేయనున్నారు. ఈ మేరకు ఆరు జిల్లాల్లో 7,33,49,825 కోడిగుడ్ల సరఫరా కోసం రూ.40,59,89,637 ప్రతిపాదించారు. జిల్లాల వారీగా కలెక్టర్ల పర్యవేక్షణలో ఎస్సీ కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్లు ఈ టెండర్ల ప్రక్రియ నిర్వహించనున్నారు. జేఎస్ భూపాలపల్లి మినహా మిగతా ఐదు జిల్లాల్లో ఈ-ప్రొక్యూర్‌మెంట్ ద్వారా గతనెల 23 నుంచి ఆన్‌లైన్ టెండర్లు పిలిచారు. ఈ మేరకు ఐదు జిల్లాల్లో ఈ నెల 6 నుంచి 12 వరకు టెండర్ షెడ్యూళ్లు దాఖలు చేయడానికి చివరి తేదీలుగా ప్రకటించారు. అంతకు ముందు జిల్లా కేంద్రాల్లో కాంట్రాక్టర్లతో కలెక్టర్‌లు ప్రీ బిడ్ సమావేశాలు కూడా నిర్వహించారు.

అక్రమాలకు అడ్డుకట్ట వేసేందుకే..

వివిధ శాఖల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వసతి గృహాలు, అంగన్‌వాడీ కేంద్రాలు, రెసిడెన్షియల్ పాఠశాలలు, కళాశాలలకు కోడిగుడ్లు సరఫరా చేసేందుకు గతంలో జిల్లా పర్చేజింగ్ కమిటీ సిఫారసు చేసేది. కలెక్టర్ చైర్మన్‌గా ఉండే ఈ కమిటీ ఆగ్‌మార్క్ నియమాల ప్రకారం అవసరమైన కోడిగుడ్లను సరఫరా చేసేందుకు అర్హులైన కాంట్రాక్టర్లను ఎంపిక చేసేది. ఆ తర్వాత కాంట్రాక్టు పొందిన వారు కోడిగుడ్ల పరిమాణం తగ్గించి సరఫరా చేయడం, టెండర్‌లో పేర్కొన్న విధంగా కాకుండా తక్కువ గుడ్లను పంపిణీ చేశారన్న ఆరోపణలు వచ్చాయి. ఈ నేపథ్యంలో ప్రభుత్వం ఈ-ప్రొక్యూర్‌మెంట్ విధానం ద్వారా ఆన్‌లైన్ టెండర్లు ఆహ్వానించింది. అర్హులైన కాంట్రాక్టర్లు బిడ్ డాక్యుమెంట్లను డౌన్‌లోడ్ చేసుకుని ఆన్‌లైన్‌లో బిడ్‌లను సమర్పించాలని నోటిఫికేషన్‌లో సూచించారు. సమర్పించిన బిడ్‌ల హార్డ్ కాపీలను ఈ నెల 6 నుంచి 12 వరకు (జిల్లాల వారీగా) జిల్లా కలెక్టరేట్/షెడ్యూల్ కులాల అభివృద్ధి శాఖ కార్యాలయాలలో అందజేయాలని పేర్కొన్నారు. ఈ మేరకు ఈ నెల 12 నుంచి 18 వరకు ఆయా జిల్లాల్లో కేటాయించిన విధంగా టెక్నికల్ బిడ్‌లు, ధరల బిడ్‌లను తెరిచి అర్హులైన వారిని ఎంపిక చేయనున్నారు.

జిల్లా	సరఫరా చేయాల్సిన కోడిగుడ్లు	కేటాయించిన డబ్బులు (రూ.లలో)
హనుమకొండ	1,31,14,397	6,71,45,713
వరంగల్	1,40,76,730	7,89,70,455
మహబూబాబాద్	1,77,87,502	10,01,43,636
జనగామ	1,26,05,592	7,09,69,483
ములుగు	78,11,600	4,39,79,308
జేఎస్ భూపాలపల్లి	79,54,004	4,47,81,042
మొత్తం	7,33,49,825	40,59,89,637

ఒక్కో జిల్లాలో ఒక్కో రేటు... హనుమకొండ, వరంగల్‌లో తక్కువ..

ఉమ్మడి వరంగల్‌లోని ఆరు జిల్లాల్లో ఒక్కో జిల్లాలో ఒక్కో రేటును ప్రతిపాదించారు. 45-52 గ్రాముల బరువు గల కోడిగుడ్లను సరఫరా చేసేందుకు ఈ ధరలను అధికారులు నిర్ణయించారు. హనుమకొండ జిల్లాలో 1,31,14,397 కోడిగుడ్లకు మొత్తం ధర రూ.6,71,45,713గా నిర్ణయించగా సగటున ఒక్కో కోడిగుడ్డు ధర రూ.5.12గా ఉంది. వరంగల్ జిల్లాలో 1,40,76,730 కోడిగుడ్లకు రూ.7,89,70,455 అవుతుండగా ఒక్కో గుడ్డు ధర సగటున రూ.5.38 పడుతోంది. అదేవిధంగా మహబూబాబాద్, ములుగు, జనగామ జిల్లాల్లో సరఫరా చేయాల్సిన కోడిగుడ్లు, కేటాయించిన డబ్బులు చూస్తే ఒక్కో గుడ్డుకు రూ.5.63 అవుతోంది. కాగా కాంట్రాక్టర్లు ఈ టెండర్లపై ఎలా స్పందిస్తారు? ఎక్కువ రేటును కోట్ చేస్తారా? ప్రభుత్వం సూచించిన ధరలకే మొగ్గు చూపుతారా? అన్న చర్చ ఓ వైపు జరుగుతుండగా.. ఈ ఆన్‌లైన్ టెండర్లలోనూ కొందరు కాంట్రాక్టర్లు సిండికేట్ కడుతున్నారన్న ప్రచారం కూడా జరుగుతోంది.

ఆరెపల్లి పాఠశాల తనిఖీ

న్యూశాయంపేట: నగర పరిధిలోని ఆరెపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను కలెక్టర్ డాక్టర్ సత్యశారద శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయుల హాజరు రిజిస్టర్, విద్యార్థుల పఠనాసామర్థ్యాలు, పాఠశాల ఆవరణ పరిశీలించారు. పాఠశాల ఆవరణలో పిచ్చి మొక్కలు ఉండడంపై ప్రధానోపాధ్యాయుడిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే మొక్కలు తొలగించాలని, అనుమతి లేకుండా విధులకు గైర్హాజరైన వాచ్‌మన్‌పై చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. విద్యార్థులతో నేరుగా మాట్లాడి ఏమైనా సమస్యలు ఉన్నాయా అని అడిగారు. కలెక్టర్ వెంట వరంగల్ తహసీల్దార్ మహ్మద్ ఇక్బాల్, ప్రధానోపాధ్యాయుడు వెంకన్న, ఉపాధ్యాయులు ఉన్నారు.



విద్యార్థి నోట్స్ పరిశీలిస్తున్న కలెక్టర్ సత్యశారద

రైతులతో ఆర్బిట్రేషన్..

గీసుకొండ మండలం ఊకల్ గ్రామరైతులతో కలెక్టరేట్‌లో శుక్రవారం నిర్వహించిన ఆర్బిట్రేషన్‌లో కలెక్టర్ సత్యశారద పాల్గొన్నారు. గ్రీన్‌ఫీల్డ్ హైవే నిర్మాణంలో భూములు కోల్పోయిన 15 మంది రైతులతో ఫైనల్ ఆర్బిట్రేషన్ నిర్వహించి అవార్డు ప్రదానం చేశారు. ఇందులో ఆర్డీఓ సత్యపాల్‌రెడ్డి, తహసీల్దార్ రియాజుద్దీన్, కలెక్టరేట్ పర్యవేక్షకుడు శ్రీకాంత్, హైవే మేనేజర్, రైతులు పాల్గొన్నారు.

ఓరుగల్లు ఖ్యాతి.. జాతీయస్థాయికి

- జిల్లావాసి కాసర్ల శ్యామ్‌కు నేషనల్ అవార్డు
- ఉత్తమ లిరిక్ రైటర్‌గా గుర్తింపు
- హర్షం వ్యక్తం చేస్తున్న జిల్లావాసులు

హన్మకొండ కల్చరల్ : ఓరుగల్లు ఖ్యాతి జాతీయస్థాయిలో మారుమోగింది. 'ఊరు పల్లెటూరు దీని తీరే అమ్మతీరు కొంగులోనా దాసిపెట్టి కొడుకు ఇచ్చే ప్రేమ వేరు'.. అంటూ పొద్దుపొడిచినప్పటినుంచి పల్లెటూరి బంధాలు, అనుబంధాలు, వాతావరణాన్ని వినసొంపుగా పాటరూపంలో బలగం సినిమాకు అందించిన కాసర్ల శ్యామ్‌కు శుక్రవారం బెస్ట్ లిరిక్స్ కేటగిరిలో నేషనల్ అవార్డు ప్రకటించారు. హనుమకొండలోని బ్రాహ్మణవాడకు చెందిన కాసర్ల శ్యామ్ జానపద పాటలు పాడటం, రాయడంలో నేర్పరి. ఈ నేపథ్యంలో జిల్లావాసికి అవార్డు రావడంతో పలువురు కళాకారులు, జిల్లా వాసులు హర్షం వ్యక్తం చేశారు.



బలగం దర్శకుడు వేణు, సంగీత దర్శకుడు భీమ్స్‌తో కాసర్ల శ్యామ్

ఎంతో సంతోషంగా ఉంది..

నేషనల్ అవార్డు రావడం సంతోషంగా ఉంది. ముందుగా బలగం టీముకు ధన్యవాదాలు తెలుపుతున్నా. పాటకు భీమ్స్ సంగీతంపాటు మంగ్లీ, రామ్ మిర్యాల వాయిస్‌లు తోడుకావడం వల్ల సంపూర్ణత్వం వచ్చింది. చిన్నతనంలో పల్లెటూర్లు తిరిగాను. పాట వింటేనే పల్లెటూరి జీవనం గుర్తుకు వచ్చేలా రాయాలని అనుకున్నా. తెలంగాణ పల్లెటూర్లలో నివసించే ప్రజలు తెల్లవారుజాము 4గంటలకే లేచి, వారు చేసే పనులు, మనుషుల మధ్య ప్రేమానుబంధాలను గుర్తు చేసుకుంటూ పాటరూపంలో రాశా. – కాసర్ల శ్యామ్, పాటల రచయిత

స్కూళ్లలో ఎఫ్ఆర్ఎస్ రిజిస్ట్రేషన్ షురూ

జనగామ: రాష్ట్ర వ్యాప్తంగా (పెద్దపల్లి మినహా) ప్రభుత్వ పాఠశాలల్లో బోధనచేసే టీచర్లకు ఫేషియల్ అటెండెన్స్(ఎఫ్ఆర్ఎస్) నమోదు శుక్రవారం నుంచి ప్రారంభమైంది. ఇందులో భాగంగా రాష్ట్రంలో ఉమ్మడి వరంగల్ జిల్లాలోని ఆరు జిల్లాల ర్యాంకులు (శాతం) విడుదల చేశారు. వరంగల్-8, హనుమకొండ-16, మహబూబాబాద్-26, జనగామ-27, ములుగు-29, భూపాలపల్లి-33వ స్థానంలో నిలిచాయి. మొబైల్ ఫోన్‌లో విద్యార్థితోపాటు ఉపాధ్యాయులు, స్కూల్ సిబ్బందికి సంబంధించి ఒకే లాగిన్‌లో వేర్వేరుగా అటెండెన్స్ తీసుకునే అవకాశం కల్పించారు. కొంతకాలంగా విద్యార్థులకు ఫేషియల్ అటెండెన్స్ విధానం కొనసాగుతుండగా.. కొత్తగా టీచర్లకు అమలు చేస్తున్నారు. ఉదయం 9.05 గంటలకు, సాయంత్రం 4.15 గంటల తర్వాత టీచర్లు, స్టాఫ్ ఫేషియల్ అటెండెన్స్ వేయాల్సి ఉంటుంది. కాగా, అటెండెన్స్ తీసుకునే సమయంలో రిజిస్ట్రేషన్ తర్వాత ఫొటో అప్‌లోడ్ అయ్యేందుకు అరగంట సమయం పట్టిందని పలువురు ఉపాధ్యాయులు తెలిపారు. సాంకేతిక సమస్య ఇలాగే కొనసాగితే అటెండెన్స్ కోసమే సమయం వృథా చేయాల్సి వస్తోందని వారు పేర్కొన్నారు.



జనగామ మండలం చీటకోడూరు ప్రభుత్వ పాఠశాలలో ఎఫ్ఆర్ఎస్ రిజిస్ట్రేషన్ చేసుకుంటున్న టీచర్ రామ్మూర్తి

ఉమ్మడి జిల్లాలో ఎఫ్ఆర్ఎస్ నమోదు వివరాలు..

జిల్లా	పాఠశాలలు	టీచర్లు	మొదటిరోజు రిజిస్ట్రేషన్	శాతం	ర్యాంకు
వరంగల్	534	3,211	2,085	64.93	08
హనుమకొండ	472	2,987	1,883	63.04	16
మహబూబాబాద్	768	3,859	2,231	57.81	26
జనగామ	459	2,773	1,572	56.69	27
ములుగు	337	1,557	832	53.44	29
భూపాలపల్లి	414	1,927	901	46.76	33



క్లుప్తంగా

విద్యుదాఘాతంతో జీపీ కార్మికుడి మృతి


విజయ్ (ఫైల్)

వెంకటాపురం(కె): విద్యుదాఘాతంతో ఓ జీపీ కార్మికుడు మృతి చెందాడు. ఈ ఘటన ములుగు జిల్లా వెంకటాపురం(కె) మండలం బీసీ మర్రిగూడెం గ్రామపంచాయతీ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు, గ్రామస్తుల కథనం ప్రకారం.. బీసీ మర్రిగూడెం గ్రామ పంచాయతీ కార్మికుడు విజయ్(33) శుక్రవారం శాంతినగర్‌లోని ప్రభుత్వ పాఠశాలలో ఫ్యాన్ బిగిస్తున్న సమయంలో విద్యుదాఘాతానికి గురై అపస్మారక స్థితిలోకి వెళ్లాడు. గమనించిన గ్రామస్తులు విజయ్‌ను వెంకటాపురం ప్రభుత్వ వైద్యశాలకు తరలిస్తుండగా మృతి చెందాడు. ఈ ఘటనపై కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

కుటుంబ కలహాలతో వ్యక్తి ఆత్మహత్య


భిక్షపతి (ఫైల్)

జఫర్‌గఢ్: కుటుంబ కలహాలతో మనస్తాపానికి గురైన ఓ వ్యక్తి.. ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన జనగామ జిల్లా జఫర్‌గఢ్ మండలం తీగారంలో చోటు చేసుకుంది. గ్రామస్తులు, ఎస్సై రామ్‌చరణ్ కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన ముక్కమాల భిక్షపతి (55) వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఇటీవల వరి నారు విక్రయించిన విషయంలో దంపతుల మధ్య స్వల్ప వివాదం చోటు చేసుకుంది. దీంతో భిక్షపతి అప్పటి నుంచి వ్యవసాయ బావి వద్దే ఉంటున్నాడు. ఈక్రమంలో మనస్తాపానికి గురైన భిక్షపతి.. శుక్రవారం వ్యవసాయ బావి వద్ద ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటనపై మృతుడి కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రామ్‌చరణ్ తెలిపారు. మృతుడికి భార్య, ముగ్గురు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు.

కిడ్నాపర్ల కోసం ఒడిశాకు పోలీసు బృందం

గీసుకొండ : మండలంలోని ధర్మారం బస్టాండ్ సమీపంలో గురువారం సాయంత్రం కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్కులోని కై టెక్స్ కంపెనీలో పని చేస్తున్న వివాహిత రింకిమల్లి కిడ్నాప్‌కు గురైన విషయం తెలిసిందే. కిడ్నాపర్లు ముందు రెక్కీ నిర్వహించి ప్లాన్‌తో సదరు వివాహితను కిడ్నాప్ చేసినట్లు తెలుస్తోంది. కారులో వచ్చి కిడ్నాప్ చేసిన అనంతరం దుండగులు నర్సంపేట వైపునకు వెళ్లినట్లు స్థానికులు చెబుతున్నారు. అయితే కిడ్నాప్‌నకు పాల్పడి వారు సదరు వివాహితభర్తతో పాటు ముగ్గురు కుటుంబ సభ్యులే అని పోలీసులు నిర్ధారించారు. వారి ఆచూకీ కోసం ఎస్సై కూడిన పోలీసు బృందాన్ని శుక్రవారం ప్రత్యేకంగా ఒడిశాకు పంపించినట్లు గీసుకొండ సీఐ మహేందర్ తెలిపారు. ఇదిలా ఉండగా.. రింకిమల్లి విషయంలో కై టెక్స్ కంపెనీ ప్రతినిధులు ఆమె ఆచూకీ కోసం పలుమార్లు సెల్‌ఫోన్ ద్వారా ప్రయత్నించగా ఆమె వారితో మాట్లాడి తన భర్తే తనను తీసుకుని వెళ్తున్నాడని, ఇందులో కిడ్నాప్ ఏమీ లేదని రింకిమల్లి బదులిచ్చినట్లు సమాచారం. పోలీసులు పూర్తి స్థాయిలో విచారణ జరిపిన తర్వాత అసలు విషయం తెలిసే అవకాశం ఉంది.



సాంకేతిక పురోభివృద్ధి..

టెక్నాలజీని అందిపుచ్చుకుంటున్న టీజీ ఎన్పీడీసీఎల్

- వినియోగదారులకు మెరుగైన సేవలందించడమే లక్ష్యంగా ముందుకు
- అంతరాయాలు లేని విద్యుత్ సరఫరా దిశగా పరుగులు..



హన్మకొండ: తెలంగాణ ఉత్తర విద్యుత్ పంపిణీ మండలి (టీజీఎన్పీడీసీఎల్) సాంకేతిక పురోభివృద్ధిలో దూసుకెళ్తోంది. నూతన సాంకేతికను అందిపుచ్చుకుంటూ వినియోగదారులకు మెరుగైన సేవలు అందించడమే లక్ష్యంగా ముందుకెళ్తోంది. ఇందులో భాగంగా అంతరాయాలు లేని విద్యుత్ సరఫరా దిశగా పరుగులు పెడుతోంది. టీజీ ఎన్పీడీసీఎల్ సీఎండీగా కర్నాటి వరుణ్ రెడ్డి బాధ్యతలు స్వీకరించిన అనంతరం సాంకేతికంగా ఎంతో అభివృద్ధి సాధించింది. ప్రధానంగా బీటెక్ కంప్యూటర్ సైన్స్ చదివిన వరుణ్ రెడ్డి టెక్నాలజీలో తన అనుభవాన్ని జోడిస్తూ ఆన్‌లైన్ సేవలను వినయోగదారుల ముందుకు తీసుకొచ్చారు. ఫలితంగా మునుపెన్నడూ లేని విధంగా కంపెనీలో టెక్నాలజీకి అత్యంత ప్రాధాన్యం పెరిగింది. 17 జిల్లాల పరిధి కలిగి ఉన్న టీజీ ఎన్పీడీసీఎల్ 72.35 లక్షల మంది వినియోగదారులకు సేవలు అందిస్తోంది. ఈ నేపథ్యంలో టీజీఎన్పీడీసీఎల్‌లో ప్రవేశపెట్టిన టెక్నాలజీపై 'సాక్షి' ప్రత్యేక కథనం..

సైది.. సైఫీ..

సిస్టమ్ ఆవరేజ్ ఇంటరప్షన్ డ్యూరేషన్ ఇండెక్స్ (సైది) అనగా వినియోగదారులకు ఎదురయ్యే సగటు అంతరాయ వ్యవధిని, సిస్టమ్ ఆవరేజ్ ఇంటరప్షన్ ఫ్రిక్వెన్సీ ఇండెక్స్ (సైఫీ) అనగా సగటు అంతరాయాల సంఖ్యని విద్యుత్ అంతరాయాలకు కొలమానంగా తీర్చిద్దిదడం. సగటున వినియోగదారుడికి ఎన్ని సార్లు జరిగిన అంతరాయంపై రియల్ టైం డేటాను క్రోడీకరించి వాస్తవ గణాంకాల ఆధారంగా విశదీకరించి అంతరాయాలు జరగకుండా సత్వర చర్యలు తీసుకుని అంతరాయాలను కనిష్ట స్థాయికి తీసుకొచ్చారు. సైది, సైఫీ ద్వారా తరచూ విద్యుత్ అంతరాయాలు జరిగే ఫీడర్లపై దృష్టి సారించి పునరావృతం కాకుండా చర్యలు తీసుకుంటున్నారు.

హైపర్..

ప్రకృతి వైపరీత్యాలు, భారీ వర్షాలు, ఈదురు గాలులు సంభవించిన సమయంలో అతి తక్కువ సమయంలో విద్యుత్ పునరుద్ధరణ చేపట్టడానికి 'హైపర్' అనే కార్యాచరణను రూపొందించారు. ఉద్యోగులు పని చేసే చోట నివాసముండి, సిబ్బంది, సామగ్రిని సమీకరించుకోవడం, సమాచార సేకరణ చేరవేయడం, పటిష్ట వ్యూహాన్ని అమలు చేయడం ద్వారా విద్యుత్ సరఫరాను వేగంగా పునరుద్ధరించడం హైపర్ ఉద్దేశం.

వాట్సాప్ చాట్‌బాట్

విద్యుత్ వినియోగదారులు తమ సమస్యలు అధికారులకు తెలియజేసేందుకు యాజమాన్యం వాట్సాప్ చాట్ బాట్‌ను తీసుకొచ్చింది. ఇందులో ముందు వినియోగదారులు తమ మొబైల్ నుంచి వాట్సాప్‌లో 7901628348 నంబర్‌కు చాట్ చేయగానే అందులో రిజిస్టర్ కంప్లైంట్, ట్రాక్ కంప్లైంట్, చాట్ విత్ ఏజెంట్ అని వస్తుంది. అందులో రిజిస్టర్ కంప్లైంట్ ఎంటర్ చేయగానే విత్ యూనిక్ సర్వీస్ నంబర్, విత్ అవుట్ యూనిక్ సర్వీస్ నంబర్, ప్రీవియస్ మెను వస్తుంది. ఇలా విత్ యూనిక్ సర్వీస్ నంబర్ ఎంటర్ చేయగానే వినియోగదారుడి సర్వీస్ వివరాలు వస్తాయి. ఈ వివరాలను ఓకే చేయగానే కంప్లైంట్‌కు సంబంధించిన వివిధ రకాలు మెనులో కనపిస్తాయి. ఇందులో కంప్లైంట్‌కు సంబంధించి సబ్ టైప్ లేదా చాట్ విత్ ఏజెంట్ వస్తుంది. ఇలా ఏజెంట్‌తో చాట్ చేయొచ్చు లేదా కంప్లైంట్ నమోదు చేయొచ్చు.

ప్రత్యామ్నాయ విద్యుత్ లైన్ల ఏర్పాటు

వినియోగదారులకు అంతరాయాలు లేని విద్యుత్ సరఫరా అందించేందుకు ప్రత్యామ్నాయ లైన్ల నిర్మాణం చేపట్టారు. ప్రకృతి వైపరీత్యాలు, మెయింటెనెన్స్, ఇతరత్రా ఏదేని కారణాలతో ఒక లైన్‌లో సమస్య ఉత్పన్నమైతే మరో లైన్ ద్వారా విద్యుత్ సరఫరా చేసేందుకు ప్రత్యామ్నాయ లైన్లు వేశారు. ప్రధానంగా 33/11 కేవీ సబ్ స్టేషన్ల మధ్య ఈ ఇంటర్ లింక్ లైన్లు వేశారు. ఫలితంగా ఒక సబ్ స్టేషన్‌లో సమస్య ఉంటే మరో సబ్ స్టేషన్ నుంచి విద్యుత్ సరఫరా అవుతుంది.

రియల్‌టైం మానిటరింగ్ సిస్టమ్..

వినియోగదారులకు మరింత మెరుగైన విద్యుత్ అందించడానికి రియల్ టైం ఫీడర్ మానిటరింగ్ సిస్టం ఎంతో దోహదపడుతుంది. ఇందులో రియల్ టైంలో కచ్చితమైన సమాచారం పొందడం ద్వారా వేగంగా చర్యలు చేపట్టొచ్చు. ఫీడర్ల పర్యవేక్షణ, త్వరితగతిన ప్రతిస్పందించడం ద్వారా అంతరాయాలు గణనీయంగా తగ్గుతాయి. రియల్ టైంలో విద్యుత్ అంతరాయ సమాచారాన్ని ఫీల్డ్ సిబ్బందికి అందించి అతి తక్కువ సమయంలో సరఫరాను పునరుద్ధరించడం దీని ద్వారా సాధ్యం.

ఇ-స్టోర్..

పేపర్ విధానంలో మెటీరియల్ విడుదలకు ఆలస్యమవుతుండడంతో ఎన్పీడీసీఎల్ యాజమాన్యం ఇ-స్టోర్ విధానాన్ని అమలులోకి తీసుకొచ్చింది. ఈ విధానంలో సంబంధిత సెక్షన్ ఏఈ పనికి కావాల్సిన మెటీరియల్ స్టాక్ ఉందో సాఫ్ట్‌వేర్‌లో పరిశీలిస్తారు. అవసరమైన స్టాక్‌ను రిజర్వ్ చేసుకుంటాడు. రిజర్వ్ చేసుకున్న మెటీరియల్ తాలూకు సమాచారం సంబంధిత ఏడీఈకి, తర్వాత స్టోర్స్‌కు ఆన్‌లైన్ ద్వారా వెళ్తుంది. మెటీరియల్ స్వీకరించే అధికారికి ఏ రోజు మెటీరియల్ విడుదల చేస్తారో ఆ తేదీని, సమయాన్ని ఎస్ఎంఎస్, సాప్ మెయిల్ రూపంలో సమాచారం చేరవేస్తారు. దీంతో నిర్ణీత సమయానికి స్టోర్స్‌కు చేరుకుని మెటీరియల్ తీసుకుంటారు. తద్వారా అధికారుల చుట్టు తిరగాల్సిన అవసరముండదు. సమయం ఆదా అవుతుంది. వ్యయప్రయాసలు తగ్గుతాయి.

ఎల్‌సీ యాప్..

విద్యుత్ ప్రమాదాల నివారణ, వినియోగదారులకు సత్వర సేవలు అందించేందుకు ఎల్‌సీ యాప్‌ను ప్రవేశపెట్టారు. మరమ్మతుల సమయంలో విద్యుత్ సరఫరా నిలిపివేసేందుకు, పునరుద్ధరణకు సమాచారం ఇచ్చేందుకు ఎల్‌సీ యాప్‌ను అందుబాటులోకి తీసుకొచ్చారు. ఎల్‌సీయాప్ ద్వారా మానవతప్పిదాలకు అవకాశముండదు. తద్వారా విద్యుత్ ప్రమాదాలు తగ్గుతాయి.

ఫాల్ట్ ప్యాసేజ్ ఇండికేటర్లు..

విద్యుత్ సరఫరా వ్యవస్థలో 33 కేవీ, 11 కేవీ విద్యుత్ లైన్లలో తలెత్తే సాంకేతిక లోపాలు వెంటనే తెలుసుకునేందుకు పొడవాటి విద్యుత్ లైన్లలో ఫాల్ట్ ప్యాసేజ్ ఇండికేటర్లు ఏర్పాటు చేశారు. విద్యుత్ లైన్‌లో లోపం జరిగిన వెంటనే అధికారులకు సమాచారం వెళ్తుంది. లోపం ఏ ప్రాంతంలో తలెత్తిందో స్పష్టంగా తెలియడం ద్వారా వేగంగా ఆ లోపాన్ని సరిచేసి తక్కువ సమయంలో విద్యుత్‌ను పునరుద్ధరిస్తారు. దీని ద్వారా విద్యుత్ అంతరాయాల సమయాన్ని గణనీయంగా తగ్గించొచ్చు.

రైల్వేస్టేషన్లలో మెరుగైన వసతులు

- డీఆర్ఎం గోపాలకృష్ణన్


డీఆర్ఎంతో కలిసి రైల్వే స్టేషన్ సందర్శిస్తున్న ఎమ్మెల్యే

మహబూబాబాద్ రూరల్ : ప్రయాణికుల అవసరాల మేరకు రైల్వే స్టేషన్లలో మెరుగైన వసతులు కల్పిస్తామని దక్షిణ మధ్య రైల్వే సికింద్రాబాద్ డివిజనల్ రైల్వే మేనేజర్ గోపాలకృష్ణన్ అన్నారు. అమృత్ భారత్ పథకంలో భాగంగా మహబూబాబాద్ రైల్వే స్టేషన్ పరిధిలో జరుగుతున్న అభివృద్ధి, నిర్మాణ పనులను శుక్రవారం పరిశీలించారు. విజయవాడ రైల్వే స్టేషన్ నుంచి ప్రత్యేక రైలులో మహబూబాబాద్ రైల్వే స్టేషన్ చేరుకున్న డీఆర్ఎం.. నిర్మాణ పనులు పరిశీలించి గడువులోగా పూర్తి చేసి ప్రయాణికులకు అందుబాటులోకి తీసుకురావాలని ఆదేశించారు.

డీఆర్ఎంను కలిసిన ఎమ్మెల్యే..

మహబూబాబాద్ రైల్వే స్టేషన్ పరిధిలో కొత్త బజారు వైపున నాలుగో ప్లాట్ ఫామ్ నిర్మించాలని ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్.. డీఆర్ఎం గోపాలకృష్ణన్‌ను కోరారు. అలాగే, రైల్వే స్టేషన్‌లో మౌలిక వసతులు కల్పించాలని, రైల్వే మెయింటెనెన్స్ వర్క్ షాపుతో పాటు గ్రాండ్ ట్రంక్, ఏపీ, తమిళనాడు, వందేభారత్, ఎల్‌టీటీ, గరీబ్ రథ్ ఎక్స్ ప్రెస్ రైళ్లను ఆపాలని, అండర్ పాస్ నిర్మించాలని కోరారు. అలాగే, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ మహ్మద్ ఫరీద్, బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి ఇందుభారతి, ఇస్లాహే మాషిరా అధ్యక్షుడు ఎక్బాల్ కూడా డీఆర్ఎంను కలిసి మానుకోట రైల్వే స్టేషన్‌లో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని కోరారు.

రైల్వే స్టేషన్ తనిఖీ..

డోర్నకల్: డోర్నకల్ రైల్వేస్టేషన్‌ను శుక్రవారం దక్షిణ మధ్య రైల్వే డివిజనల్ మేనేజర్ గోపాలకృష్ణన్ తనిఖీ చేశారు. ప్రత్యేక రైలులో డోర్నకల్ చేరుకున్న డీఆర్ఎం రైల్వే స్టేషన్‌లోని ప్లాట్‌ఫామ్‌లను తనిఖీ చేశారు. అనంతరం గూడ్స్ యార్డులోని సీ అండ్ డబ్ల్యూ డిపోను తనిఖీ చేశారు. డీఆర్‌యూసీసీ సభ్యులు ఖాదర్, వర్తక సంఘం ప్రముఖులు కాలా మహేందర్‌జైన్ తదితరులు రద్దయిన ప్యాసింజర్ రైళ్లను పునరుద్ధరించాలని, పలు ఎక్స్‌ప్రెస్ రైళ్లకు డోర్నకల్‌లో హాల్ట్ కల్పించాలని కోరుతూ డీఆర్ఎంకు వినతిపత్రం అందజేశారు.

చేతులు, కాళ్లను చున్నీతో కట్టి..

మరో చున్నీతో మెడ బిగించి..

భార్యను దారుణంగా హత్య చేసిన భర్త

- వివాహేతర సంబంధమే కారణం
- ఏనుమాముల బాలాజీనగర్‌లో ఘటన


రేష్మా సుల్తానా మృతదేహం

ఖిలా వరంగల్ : ప్రేమించి పెళ్లి చేసున్నాం.. అన్ని మర్చిపోయి సంతోషంగా జీవిద్దామని భార్యను ప్రాధేయపడినా.. మనసు మార్చుకోకపోవడంతో వివాహేతర సంబంధం కొనసాగిస్తున్న భార్యను భర్త దారుణంగా హత్య చేశాడు. ఈ ఘటన గురువారం రాత్రి వరంగల్ ఏనుమాముల పోలీస్ స్టేషన్ పరిధి బాలాజీ నగర్‌లోని కమ్మల గుడి సమీపంలో చోటుచేసుకుంది. పోలీసులు కథనం ప్రకారం.. ఉత్తర్‌ప్రదేశ్‌కు చెందిన రితేష్ సింగ్ ఠాకూర్ అలియాస్ పద్దు ఆరేళ్ల క్రితం బతుకుదెరువు నిమిత్తం వరంగల్ వచ్చి కమ్మల గుడి వద్ద నివాసముంటూ ఐస్‌క్రీమ్ వ్యాపారం కొనసాగిస్తున్నాడు. ఐదేళ్ల క్రితం రితేష్ సింగ్ ఠాకూర్‌ను ఏనుమాముల రోడ్డులోని లక్ష్మీ గణపతి కాలనీకి చెందిన ఎండీ. మహబూబ్ కుమార్తె రేష్మా సుల్తానా ప్రేమించి పెళ్లి చేసుకుంది. ఈ దంపతులకు ఇద్దరు కుమార్తెలు సురాజ్, సరస్వతి ఉన్నారు. దంపతులు ఐస్‌క్రీమ్ వ్యాపారం నిర్వహించుకుంటూ అన్యోన్యంగా జీవిస్తున్నారు. ఈ క్రమంలో ఆరునెలల క్రితం రేష్మా సుల్తానాకు ఉత్తర్‌ప్రదేశ్‌కు చెందిన సన్నీతో పరిచయం ఏర్పడింది. సన్నీ, రితేష్ సింగ్ ఇద్దరు ఉత్తర్ ప్రదేశ్ వాసులు కావడంతో వీరి మధ్య స్నేహం ఏర్పడింది. సన్నీ తరచూ ఇంటికి రావడంతో రేష్మా సుల్తానా వివాహేతర సంబంధానికి దారితీసింది. ఈ విషయం రితేష్ సింగ్‌కు తెలియడంతో భార్యను మందలించాడు. తర్వాత తమ నివాసాన్ని శాంతినగర్‌కు మార్చాడు. మూడు రోజుల క్రితం రేష్మా సుల్తానా బాలాజీ నగర్‌లోని తల్లి ఇంటికి వచ్చింది. ఆ వెంటనే భర్త రితేష్ సింగ్ కూడా వచ్చి సన్నీని మర్చిపో.. సంతోషంగా జీవిద్దామని రేష్మా సుల్తానాకు సర్ది చెప్పాడు. అనంతరం జూలై 30న తన భార్యను ఆస్పత్రికి తీసుకెళ్లి వైద్య పరీక్షలు చేయగా.. ఆమె గర్భవతి అని నిర్ధారణ అయ్యింది. దీంతో భార్యపై కోపం పెంచుకున్నాడు. అనంతరం జూలై 31న రాత్రి 8 గంటలకు రేష్మా సుల్తానా తల్లి ఇంట్లో లేని సమయంలో రితేష్ సింగ్.. భార్యతో గొడవ పడి ఆమె చేతులు, కాళ్లను చున్నీతో కట్టి, మరో చున్నీతో మెడకు బిగించి ఉరివేసి దారుణంగా హత్య చేసి పరారయ్యాడు. శుక్రవారం ఉదయం 5.30 గంటలకు రేష్మా సుల్తానా తల్లి ఇంటికి వచ్చి చూడగా.. కుమార్తె చనిపోయి కనిపించింది. సమాచారం అందుకున్న ఏనుమాముల ఇన్‌స్పెక్టర్ సురేశ్ ఘటనా స్థలికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించి హత్యకు గల కారణాలను స్థానికులను అడిగి తెలుసుకున్నారు. మృతదేహాన్ని ఎంజీఎం మార్చురీకి తరలించారు. మృతురాలి సోదరుడు యాకూబ్‌పాషా ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ జె.సురేశ్ తెలిపారు.

బీసీల్లో సామాజిక విప్లవం వస్తుంది

- బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్


మాట్లాడుతున్న బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్

కేయూ క్యాంపస్ : బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించడంలో పాలకులు నాన్చివేత ధోరణి అవలంబిస్తున్నారని, ఆ వాటా సాధించుకునేందుకు బీసీల్లో సామాజిక విప్లవం వస్తుందని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. శుక్రవారం తెలంగాణ పూలే ఆశయ సాధన సమితి (పాస్), నేషనల్ బ్యాక్‌వర్డ్ క్లాస్ వెల్ఫేర్ అసోసియేషన్ (ఎన్‌బీసీడబ్ల్యూఏ) ఆధ్వర్యంలో కాకతీయ యూనివర్సిటీలోని దూరవిద్యాకేంద్రంలో నిర్వహించిన బీసీ ఇంటలెక్చువల్స్ సదస్సులో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. కాకతీయ గడ్డ నుంచే తెలంగాణ రాష్ట్రసాధన తరహాలో బీసీ రిజర్వేషన్ల కోసం బీజేపీపై ఉద్యమం చేయాల్సి వస్తుందన్నారు. కాంగ్రెస్ పార్టీ కామారెడ్డి డిక్లరేషన్ పేరుతో బీసీలకు న్యాయం చేయడం కోసం చేస్తున్న ప్రయత్నాలను స్వాగతిస్తున్నామన్నారు. ఆ పార్టీ బీసీ కులగణన చేపట్టి 42 శాతం రిజర్వేషన్లు కల్పించేందుకు ఉపక్రమించిందన్నారు. అయితే బీజేపీ వ్యవహరిస్తున్న తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. బీసీలకు 42శాతం రిజర్వేషన్లు అమలుకు రాష్ట్ర అసెంబ్లీ తీర్మానం చేసి పంపితే కేంద్ర ప్రభుత్వం మూడునెలలుగా ఆమోదించకుండా జాప్యం చేస్తుందని మండిపడ్డారు. బీఆర్ఎస్ బీజేపీ తోడుదొంగలేనన్నారు. బీఆర్ఎస్‌కు బీసీలపై ప్రేమ ఉంటే కరీంనగర్‌లో 8న జరగబోయే బీఆర్ఎస్ బీసీ శంఖారావం సభకు ముందు ఆ రాష్ట్ర పార్టీ అధ్యక్షుడిగా బీసీని నియమించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో ఎన్‌బీసీడబ్లూఏ బాధ్యుడు చలమల్లా వెంకటేశ్వర్లు, 'పాస్' వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ సంగనిమల్లేశ్వర్, రాష్ట్ర ఉద్యమకారులవేదిక చైర్మన్ కె. వెంకటనారాయణ, 'కుర్మా' జనరల్ సెక్రటరీ వడ్డెరవీందర్, 'పాస్' జిల్లా అధ్యక్షుడు శాస్త్రి, వివిధ సంఘాల బాధ్యులు బాబుయాదవ్, చందా మల్లయ్య, గడ్డం కృష్ణ, ఆకుతోట శ్రీనివాస్, తిరునహరిశేషు, తదితరులు పాల్గొన్నారు. కాగా, బీసీ సంఘాల ప్రతినిధులు ఈ సదస్సు నివేదికను రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకు సమర్పించాలని సదస్సు తీర్మానించింది. ఆ లేఖను రాష్ట్రపతికి ట్విటర్ ద్వారా పంపినట్లు సంగని మల్లేశ్వర్ తెలిపారు.

నైపుణ్యాలతోనే శాఖాపరమైన గుర్తింపు

- పోటీలతో మానసిక ఒత్తిడి దూరం
- వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్‌సింగ్


డ్యూటీమీట్‌లో పతకాలు సాధించిన పోలీసు అధికారులు, సిబ్బంది


సాంస్కృతిక కార్యక్రమాల్లో నృత్యం చేస్తున్న సీపీ సన్ ప్రీత్‌సింగ్

ఖిలా వరంగల్: పోలీసులు విధి నిర్వహణతోపాటు నైపుణాలను పెంపొందించుకుంటేనే శాఖాపరమైన గుర్తింపు లభిస్తుందని వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్ అన్నారు. వరంగల్ మామునూరు పోలీస్ శిక్షణ కళాశాల పరేడ్ గ్రౌండ్‌లో వరంగల్ పోలీస్ కమిషనరేట్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రాష్ట్ర స్థాయి పోలీస్ డ్యూటీ మీట్‌లో భాగంగా శుక్రవారం రెండో రోజు జరిగిన పోటీలను సీపీ ప్రారంభించి మాట్లాడారు. పోలీస్ డ్యూటీ మీట్‌లో పాల్గొన్న అధికారులు, సిబ్బందికి మానసిక ఒత్తిడి దూరమై ప్రశాంతత లభిస్తుందన్నారు. పోలీసుల నైపుణ్యాలను వెలికి తీసేందుకు ఇలాంటి పోటీలు దోహదపడుతాయన్నారు. శనివారం సాయంత్రం 5గంటల ముగింపు వేడుకలు జరగనున్నాయని, ముఖ్యఅతిథిగా డీజీపీ జితేందర్‌తోపాటు విశిష్ట అతిథిగా జైళ్ల విభాగం డీజీపీ డాక్టర్ సౌమ్య మిశ్రా హాజరవుతున్నట్లు తెలిపారు. కాగా, డ్యూటీ మీట్ విజయవంతానికి కృషి చేస్తున్న అదనపు డీసీపీలు రవి, సురేశ్‌కుమార్, శ్రీనివాస్‌తోపాటు ఇతర అధికారులను సీపీ అభినందించారు.

ఉత్కంఠగా కొనసాగుతున్న పోటీలు..

రాష్ట్రస్థాయి పోలీస్ డ్యూటీ మీట్ పోటీలు ఉత్కంఠగా కొనసాగుతున్నాయి. నువ్వా? నేనా అన్నట్లు విజయం కోసం పోటీ పడుతున్నారు. ప్రధానంగా బాంబ్ డిస్పోజల్, పోలీస్ జాగిలాలకు సంబంధించి నాలుగు విభాగాలు,కంప్యూటర్, వీడియో గ్రఫీ, సైంటిఫిక్ ఎయిడ్ విభాగాల్లో పోటీలు జరిగాయి.

మోహన్ కృష్ణకు బంగారు పతకం..

రాష్ట్రస్థాయి పోలీస్ డ్యూటీ మీట్‌లో భాగంగా వరంగల్ పోలీస్ కమిషనరేట్ పీఆర్ఓ మన్నవ మోహన కృష్ణ ప్రొఫెషనల్ ఫొటోగ్రఫీ విభాగంలో బంగారు పతకం సాధించారు. కాగా, ఆయనను సీపీ సన్ ప్రీత్ సింగ్ అభినందించారు.

ఆటా..పాట

డ్యూటీమీట్‌లో భాగంగా సాయంత్రం విందు అనంతరం ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాల్లో సీపీ తన సహచరులతో కలిసి పాటలకు స్టెప్పులేసి అందరినీ అలరించారు.

హత్య కేసులో యావజ్జీవ కారాగార శిక్ష

వరంగల్ లీగల్ : ఓ మహిళ తనను వివాహం చేసుకోమని కోరగా కోపోద్రిక్తుడై ఆమెపై కిరోసిన్ పోసి నిప్పంటించి చంపిన ఘటనలో నేరం రుజువుకావడంతో మహబూబాబాద్ జిల్లా తొర్రూరు మండలం జమస్తాపురం గ్రామానికి చెందిన నేరస్తుడు చిన్నపాక అనిల్‌కు యావజ్జీవ కారాగార శిక్ష, రూ.10 వేల జరిమానా విధిస్తూ వరంగల్ రెండో అదనపు జిల్లా కోర్టు జడ్జి మనీషా శ్రావణ్ ఉన్నవ్ శుక్రవారం తీర్పు వెలువరించారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్ జి.సంతోషి కథనం ప్రకారం.. వరంగల్ జిల్లా రాయపర్తి మండలం ఊకల్‌కు చెందిన పార్వతితో చెన్నారావుపేట మండలం తిమ్మరాయినిపహాడ్‌కు చెందిన సింగారపు బాబుకు వివాహం జరిగింది. కొన్ని సంవత్సరాల అనంతరం బాబు అనారోగ్య కారణాలతో మృతి చెందాడు. దీంతో పార్వతి రంగశాయిపేటలో అద్దెకుంటూ కూలీ చేసుకుంటూ జీవించేది. పక్కనే అద్దెకుంటున్న చిన్నపాక అనిల్‌తో ఏర్పడిన పరిచయం వివాహేతర సంబంధానికి దారితీసింది. ఈ విషయమై పార్వతి సోదరులు పలుమార్లు హెచ్చరించినా ఇరువురిలో మార్పు రాలేదు. దీంతో పార్వతిని తన తండ్రి స్వగ్రామం ఊకల్‌కు తీసుకెళ్లాడు. ఈ క్రమంలో పార్వతి తండ్రి మృతి చెందడంతో అనిల్ ఊకల్‌కు రావడం ప్రారంభించాడు. 2015, జూన్ 7న ఊకల్‌కు వచ్చిన అనిల్‌ను తనను వివాహం చేసుకోవాలని పార్వతి నిలదీసింది. దీంతో కోపోద్రిక్తుడైన అనిల్.. పార్వతిపై కిరోసిన్ పోసి నిప్పంటించాడు. పార్వతి కేకలు విని చుట్టూ పక్కల వారు రాగా అనిల్ పరారయ్యాడు. పార్వతిని 108లో ఎంజీఎం తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందింది. ఈ ఘటనపై పార్వతి సోదరుడు వెంకన్న.. రాయపర్తి పోలీసులకు ఫిర్యాదు చేయగా వారు నిందితుడిని అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపర్చారు. విచారణలో సాక్ష్యాధారాలను పరిశీలించిన కోర్టు.. నేరం రుజువుకావడంతో అనిల్‌కు యావజ్జీవ కారాగార శిక్ష, రూ.10 వేల జరిమానా విధిస్తూ జడ్జి మనీషా శ్రావణ్ ఉన్నవ్ తీర్పు వెలువరించారు. కేసును పోలీస్ అధికారులు ఎస్.శ్రీనివాస్, ఆర్.సంతోష్ పరిశోధించగా లైజన్ ఆఫీసర్ హరికృష్ణ పర్యవేక్షణలో హెడ్‌కానిస్టేబుల్ సోమనాయక్, కానిస్టేబుల్ అనిల్ సాక్షులను కోర్టులో ప్రవేశపెట్టారు.

రామప్ప నుంచి లక్నవరానికి నీటి కాల్వ

- తద్వారా రెండు పంటలకూ సాగు నీరు
- రాష్ట్ర పంచాయతీ రాజ్ శాఖ మంత్రి సీతక్క


నీరు విడుదల చేస్తున్న మంత్రి సీతక్క, కలెక్టర్ దివాకర టీఎస్

గోవిందరావుపేట: రామప్ప నుంచి లక్నవరం వరకు నీటి కాల్వ ఏర్పాటు చేస్తామని, తద్వారా రైతులకు ఏడాదిలో రెండు పంటలకూ నీరు అందే అవకాశం ఉంటుందని రాష్ట్ర పంచాయతీ రాజ్ శాఖ మంత్రి సీతక్క అన్నారు. శుక్రవారం మండలంలోని లక్నవరం సరస్సు నీటిని కలెక్టర్ దివాకర టీఎస్, గ్రంథాలయ సంస్థ చైర్మన్ రవిచందర్, మార్కెట్ కమిటీ చైర్మన్ రేగ కల్యాణితో కలిసి పంట కాల్వలకు విడుదల చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రాష్ట్రంలో సాగునీటి వనరుల విస్తరణకు ప్రభుత్వం కట్టుబడి పని చేస్తోందన్నారు. గ్రామాల అభివృద్ధికి కాకతీయులు చెరువులు తవ్వించి సాగు, తాగునీరు అందించేవారన్నారు. వారి స్ఫూర్తితోనే గ్రామీణాభివృద్ధికి ప్రణాళికతో పని చేస్తున్నామన్నారు. చెరువులో నీరు ఉంటే గ్రామం పచ్చగా ఉంటుందని, అదే స్ఫూర్తితో రైతులకు నీటి కొరత లేకుండా పని చేస్తున్నామన్నారు. రైతు సంక్షేమం కోసం రేవంత్ రెడ్డి ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందని తెలిపారు. కార్యక్రమంలో ఇరిగేషన్ ఈఈ నారాయణ, అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

ఫిరాయింపు ఎమ్మెల్యేలు రాజీనామా చేయాలి

- ఎమ్మెల్సీ తక్కెళ్లపల్లి రవీందర్ రావు


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ రవీందర్ రావు

హన్మకొండ: ఫిరాయింపు ఎమ్మెల్యేలకు సిగ్గుంటే ఇప్పటికైనా రాజీనామా చేయాలని ఎమ్మెల్సీ తక్కెళ్లపల్లి రవీందర్ రావు డిమాండ్ చేశారు. శుక్రవారం హనుమకొండ బాలసముద్రంలోని బీఆర్ఎస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పార్టీ ఫిరాయింపులపై సుప్రీం కోర్టు తీర్పుపై బీఆర్ఎస్‌కు చెంపపెట్టు అని, కాంగ్రెస్ నాయకులు వక్రభాష్యం పలుకుతున్నారని విమర్శించారు. 52వ రాజ్యాంగ సవరణ ద్వారా మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ పార్టీ ఫిరాయింపుల చట్టాన్ని తీసుకొచ్చారన్నారు. ఈ చట్టంపై గౌరవం ఉంటే ఆ ఎమ్మెల్యేలపై అనర్హత వేటు వేయాలని డిమాండ్ చేశారు. ఏళ్ల తరబడి ఫిరాయింపు పిటిషన్లు స్పీకర్ పెండింగ్‌లో ఉంచడం సరికాదని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ గవాయ్ నేతృత్వంలోని అత్యున్నత ధర్మాసనం తెలిపిందన్నారు. స్పీకర్‌కు నైతికత ఉంటే పార్టీ మారిన ఎమ్మెల్యేలపై అనర్హత వేటు వేయాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ఇన్‌చార్జ్ మీనాక్షి నటరాజన్ సమాంతర ముఖ్యమంత్రిగా వ్యవహరిస్తున్నారన్నారు. సమావేశంలో 'కుడా' మాజీ చైర్మన్ మర్రి యాదవ రెడ్డి, నాయకులు జోరిక రమేశ్, తాళ్లపల్లి జనార్దన్ గౌడ్, పులి రజినీకాంత్, రవీందర్ రావు, నయీముద్దీన్, బండి రజినీకుమార్, పోలెపల్లి రామ్మూర్తి, బొల్లికొండ వీరేందర్, బుద్దె వెంకన్న, మూటిక రాజు, రమేశ్, శ్రీకాంత్ చారి, మహేందర్, సతీశ్, దేవమ్మ, గౌస్‌ఖాన్, జేకే పాల్గొన్నారు.

34 రైళ్ల సర్వీస్‌ల పొడిగింపు

కాజీపేట రూరల్ : ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకుని కాజీపేట జంక్షన్ మీదుగా ప్రయాణించే చర్లపల్లి–పట్నా ప్రత్యేక రైళ్ల సర్వీస్‌లను పొడిగిస్తున్నట్లు దక్షిణ మధ్య రైల్వే సీపీఆర్వో ఎ.శ్రీధర్ శుక్రవారం తెలిపారు.

పొడిగింపు రైళ్ల వివరాలు..

ఆగస్టు 4వ తేదీ నుంచి సెప్టెంబర్ 29వ తేదీ వరకు పట్నా–చర్లపల్లి (03253) పట్నా ఎక్స్‌ప్రెస్ ప్రతీ సోమ, బుధవారాల్లో 17 రైళ్ల సర్వీస్‌లు, ఆగస్టు 6వ తేదీ నుంచి అక్టోబర్ 1వ తేదీ వరకు చర్లపల్లి–పట్నా (07255) పట్నా ఎక్స్‌ప్రెస్ ప్రతీ బుధవారం 9 రైళ్ల సర్వీస్‌లు, ఆగస్టు 8వ తేదీ నుంచి సెప్టెంబర్ 26వ తేదీ వరకు చర్లపల్లి–పట్నా (07256) పట్నా ఎక్స్‌ప్రెస్ ప్రతీ శుక్రవారం 8 రైళ్ల సర్వీస్‌లను పొడిగించి నడిపిస్తున్నట్లు తెలిపారు.

హాల్టింగ్ స్టేషన్లు..

కాజీపేట మీదుగా చర్లపల్లి–పట్నా అప్ అండ్ డౌన్ రూట్‌లో ప్రయాణించే రైళ్ల సర్వీస్‌లకు సికింద్రాబాద్, కాజీపేట, పెద్దపల్లి, బెల్లంపల్లి, సిర్పూర్‌కాగజ్‌నగర్, బల్హార్షా, నాగ్‌పూర్, గోండియా, దుర్గ్, రాయ్‌పూర్, బిలాస్‌పూర్, జర్సుగూడ, రూర్కెలా, హథియా, రాంచీ, బొకారో స్టీల్ సిటీ, గోమ్, కోడేమా, గయా, జెహన్‌బాద్ స్టేషన్‌లో హాల్టింగ్ కల్పించారు. ఈ రైళ్లకు 2 ఏసీ, 3 ఏసీ, స్లీపర్ అండ్ జనరల్ సెకండ్ క్లాస్ కోచ్‌ల సౌకర్యం కల్పించారు.

సాక్షి క్లాసిఫైడ్స్

REAL ESTATE

- గోపాల్‌పూర్ మెయిన్‌రోడ్డుకు గల (మాధవనగర్ రోడ్డు నెంబర్ 2 & 3 కి మధ్యన ఉన్న) 415 Sq. yards ఇంటితో సహా (LRS మరియు BRS పర్మిషన్లతో గల) అమ్మబడును. వివరాలకు సంప్ర. సెల్ : 98951 00035. [SCA 25006850]

FLATS FOR SALE

- Ready to Occupy 1 BHK, 2BHK & 3 BHK Flats with all Facilities for Sale @ 941 Sqft to 1914 sqft with reasonable Prices at Vikas Nagar & Basith Nagar. Ph: 8897221187, 9177592357. [WA-6753]

WANTED

- Multinational Company Part Time / Full time work Training / Support Given. Contact No: 8106144217. [WA-6754]
- స్వామి వివేకానంద ఓల్డేజ్ హోం (VJA): శ్రీమంతుల ఇండ్లలో వృద్ధులు/పేషంట్ల సేవకు, ఇంటి/ వంట పని, బేబీ కేర్ కొరకు 10th ఆపై చదివి, Age: 20-30 కలిగిన (M/F) వర్కర్లు కావలెను. భో+వ+జీ: 18-20 వేలు. ఏజెంట్ల కమీషన్: 5000 ✆ 9959031122, 9676901122 [B-1275596]

4 లైన్ల క్లాసిఫైడ్ ప్రకటన రూ॥ 260/- అదనపు లైను రూ॥ 60/- మాత్రమే 5% GST అదనము

ఈ సెక్షన్‌లో ప్రకటనల కొరకై సంప్రదించండి

వరంగల్	9705748198 9866574715
నర్సంపేట	9553955722
జనగామ	9951602871
మహబూబాబాద్	9010144453
పరకాల	9010299096
జయశంకర్ భూపాలపల్లి	9705748198

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వారా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.